# శివలీల


## శారదా అశోకవర్ధన్

**శివప్రసాద్‌కి పెళ్లామంటే ఒళ్లుమంట! గొడ్డుని చూసినట్టు చూస్తాడు! ఆమె అంటే ప్రేమకాని, గౌరవంకాని, చివరికి సానుభూతి కూడా లేదు! అతని దృష్టిలో ఆమె కేవలం ఒక మాంసపు ముద్ద! మెదడులేని మనిషి! చదువురాని మొద్దు!**

"మరి పెళ్లెందుకు చేసుకున్నావయ్యా" అంటే "ఎవర్నైనా చేసుకోకపోతే చంపేస్తా నన్నాడు నాన్న! ఆమె తెచ్చిన యాభై వేల కట్నంలో నాకున్న ఈ మోటర్ సైకిల్ తప్ప మిగిలిన దంతా నాన్నే ఖర్చు పెట్టుకున్నాడు- ఇంటి రిపేర్లకనీ, కంటి ఆపరేషన్ కనీ, చెల్లాయి పెళ్లి కనీ!"

"ఓహో! పెళ్లి నాన్న కోసం చేసుకున్నా వన్నమాట! మరి ముగ్గురు పిల్లల్ని కూడా కన్నావ్?" కోపం పట్టలేక కసిగానే అడిగాను. "అవును! పిల్లలుంటేనే కదా, సంసారం చేస్తున్నాం అనుకుంటాడు నాన్న! పైగా దానికీ కాలక్షేపమేగా పిల్లల్తో? అందుకే కనిపారేశాను" పకపకా నవ్వేడు శివప్రసాద్ పెద్ద ఘనకార్యం చేసినట్టు.

అతని మాటలూ, మాట్లాడిన తీరు చూస్తూంటే చిర్రెత్తింది నాకు! "ఇతడు మనిషా, రాక్షసా" అని పించింది. దేవతలాంటి సరస్వతి రూపం మనసంతా నిండిపోయింది. తెల్లగా, సన్నగా, పెద్ద జడా, తీరైన కన్నూ, ముక్కూ, చదువు లేకపోయినా (అంటే డిగ్రీలు లేకపోయినా, సరస్వతి ఏడో తరగతి ప్యాస యింది.) సంస్కారం వుట్టిపడే విగ్రహం, అన్నింటినీ సహించే నిగ్రహం. ముగ్ధ సౌందర్యం ఆమెది! మూగ ప్రేమ ఆమెది! ఆమెను ద్వేషిస్తూ, అసహ్యించు కుంటూ, చులకనగా మాట్లాడుతున్న శివప్రసాద్‌ని చూస్తూ వుంటే అతని 'లా' డిగ్రీని తగలబెట్టాలని పించింది. ఆడదాన్ని, అందులోనూ అర్థాంగిని, ఆదరించి ప్రేమించలేని 'ఎడ్యుకేటెడ్ బ్రూట్' అనిపించింది. "యూ...ఆర్...టూ... బాడ్ !... ప్రేమ , అను రాగం , ఆప్యాయతా ఇవ్వకుండా, కేవలం యంత్రంలా పిల్లల్ని కనడానికి మాత్రమే భర్త తనని ఉపయోగించు కుంటున్నాడూ అంటే, ఏ ఆడదానికీ ఆ భర్తమీద గౌరవం వుండదు! కానీ కాలక్షేపానికి కాక, కన్న బిడ్డల్ని, కర్తవ్య బద్ధురాలై కంటికి రెప్పలా కాపాడుకుంటుంది. శివప్రసాద్ గారూ! ఆడది అణకువగా వుంటే అబల అని మాత్రం అనుకోకండి" అని చెప్పి మరీ అతని ముందు ఒక్క క్షణం కూడా కూర్చోలేక వెళ్ళిపోయాను లోపలికి.




"అతని గొడవలు మనకెందుకు?" అంటూ నవ్వుతూనే మందలించారు మా ఆయన, తన క్లాస్ మేటుని నేను ఏమీ అనడం ఇష్టంలేక.

శివప్రసాదు మావారికి స్నేహితుడు కాదు కానీ, క్లాస్ మేటవడం చేత అప్పుడప్పుడు వచ్చి కూర్చుం టాడు.

ఒక రోజు పిడుగులాంటి వార్త విన్నాను. శివప్రసాద్ సరస్వతి నొదిలేసి, ప్రెటీషియా అనే ఇంగ్లీషమ్మాయిని పెళ్లి చేసుకోవాలను కుంటున్నాట్ట! రాత్రింబవళ్లా ఆమెతోనే తిరుగుతున్నాట్ట. మావారు మోసుకొచ్చిన వార్త! సరస్వతి జాలిగా, బేలగా నావేపు చూస్తున్నట్టని పించింది.

"నోరు మూసుకుని ఊరు కోకుండా సరస్వతి కోర్టు కెళ్లవలసింది" అన్నాను సరస్వతి మీద జాలీ, శివ ప్రసాద్ మీద కోపంతో.

మరో రోజు మళ్లీ మావారే మోసుకొచ్చారీ వార్త! సరస్వతి పిల్లల్తో పుట్టింటికి వెళ్లిపోయిందనీ, శివప్రసాదు, ప్రెటీషియాతో లండన్‌కి వెళ్లిపోయాడనీ! నాకు మతి పోయింది. ఏం చెయ్యను? సరస్వతి కోసం కన్నీళ్ళు కార్చడం తప్ప! పండగకనీ, పబ్బానికనీ, పురిటికనీ దేనికో ఒక దానికనీ అస్తమానం శివప్రసాద్ తనని పుట్టింటికి పంపేస్తున్నా ఎదురు తిరగక, విషాదాన్ని గుండెల్లోనే దాచుకున్న సరస్వతి మంచితనం మీద తీరని కోపం వొచ్చింది మొదటి సారిగా.

"ఏమిటాలోచిస్తున్నావ్?" అన్నారు మావారు.

"అదే! సరస్వతి! ఎదురు తిరగాల్సింది! శివ ప్రసాద్‌కి బుద్ధొచ్చేలా పదిమందిలో అతని పరువు తీయాల్సింది" అన్నాను కష్టగా ఉద్రేకంతో!

"సరస్వతి తెలివైన పిల్ల! అలా చెయ్యదు" అన్నా రాయన.

ఆశ్చర్యంగా అతనికేసి చూశాను.

అతను నవ్వుతూ చూస్తున్నారు నన్ను.


ఆయన ఎందుకలా అన్నారో అర్థం కాకపోయినా,

అడగడానికి ఆత్మాభిమానం అడ్డొచ్చి అడక్కుండా వూరుకున్నాను, అర్థమయిన దానిలా పోజుపెట్టి.

** ** **

కాలచక్రంలో రెండు క్యాలండర్లు మారాయి! ఈలోగా శివప్రసాద్ గురించి మర్చేపోయాను.

ఆ రోజు ఆదివారం. సెలవు రోజయితే మావారు మామూలుగా కన్నా కాస్త ఎక్కువే వెళతారు మార్నింగ్ వాక్‌కి! ఆ రోజు ఉదయం అయిదింటికి వెళ్లినవారు ఎనిమిది కావస్తున్నా ఇంటికి రాకపోయేసరికి, కంగారుగా వరండాలోనే నుంచున్నాను శ్రీవారి కోసం ఎదురు చూస్తూ. దాదాపు ఎనిమిదిన్నరకి మెల్లగా చేతు లూపుకుంటూ లోపలికొస్తున్న అతణ్ణి చూస్తే కోపం వచ్చినా, వెనకాలే ఎవరో రావడం చూసి, కోపాన్ని దిగ మింగుకుని లోపలి కెళ్లిపోయాను.




శ్రీవారు నాకోపాన్ని గ్రహించినట్టున్నారు. మెల్లగా నవ్వుకుంటూ వెనకాలే వొచ్చి "ఎవరొచ్చారో చూశావా? రెండు కప్పులు కాఫీ పంపించు" అన్నారు.

"ఎవరు?" అని అడక్కుండానే, రెండు కప్పులు కాఫీ చేసి తీసుకెళ్ళాను.

శివప్రసాద్ వీక్లీ తిరగేస్తూ కూర్చున్నాడు. "బాగున్నారా?" "ఎప్పుడొచ్చారూ?" లాంటి ముక్తసరి ప్రశ్నలు పూర్తిచేసి వెనక్కొచ్చేశాను. ఎందుకో మరి మాట్లాడ బుద్ధి కాలేదు. కాస్సేపు కూర్చుని అతను వెళ్లిపోయాడు.

"ప్రెటీషియాని పెళ్లి చేసుకున్నాడా?" కుతూహలంగా అడిగాను.

"పెళ్లీలేదు గిళ్లీలేదూ."

"మరి అక్కడికెందుకు తీసికెళ్లింది?"

"వీడు డబ్బిచ్చి టిక్కెట్టు కొనుక్కుంటే తీసు కెళ్ళింది!"

"అయితే పెళ్ళి చేసుకోలేదా?"

"లేదు! వీడు పట్టుకెళ్లిన డబ్బులు కాస్తా అయిపోయే వరకూ అన్ని వూళ్లూ తిరిగారు! ఆవిడ అదివరకు విడాకులిచ్చిన భర్త జాన్‌గారి స్నేహితుడు రాబిన్‌ని పెళ్లి చేసుకుని, మనవాడికి 'గుడ్‌బై' చెప్పేసింది."

ఆశ్చర్యంతో నోరు తెరిచాను. "వివాహం తెంచుకోవడం, చేసుకోవడం అంత సులువన్నమాట! మరైతే ఇప్పుడేం చేస్తాడు మనవాడు?" అన్నాడు ఎగతాళిగా.

"ఏం చేస్తాడూ? భార్యామణీ... దిక్కు నువ్వే సుమీ... అని పాడుకుంటూ వెళ్లి ధర్మపత్ని కాళ్లమీద పడతాడు" అన్నారాయన.

ఆలోచిస్తూ వుండిపోయాను.

కాలం తెలీకుండానే ఓ నెల గడిచిపోయింది.

ఓ రోజు సాయంత్రం శివప్రసాదు సకుటుంబంగా మా ఇంటి కొచ్చాడు. సరస్వతి నన్ను చూసి తృప్తిగా నవ్వింది. "కులాసానా?" అన్నాను.

'ఆ' అంటూ తలూపింది. "మనవాడు దారిలో పడ్డట్టున్నాడే! మారాడా? అలాగే వున్నాడా?" అన్నాను. "ఆయన పూర్తిగా మారిపోయారు. ఒక్క క్షణం నన్నూ, పిల్లల్నీ వదిలి వుండడంలేదు. ఇక్కడే ఏదో సిమెంటు ఫ్యాక్టరీలో ఉద్యోగం వచ్చింది. పిల్లల్ని కాన్వెంటులో చేర్పించాం. సికింద్రాబాదులోనే మారేడుపల్లిలో ఇల్లు అద్దెకి తీసుకున్నాం. మీరు తప్పకుండా రేపు ఆదివారం మా ఇంటికి భోజనానికి రావాలి!" సరస్వతి కేసి గుడ్లప్పగించి చూస్తూ వుండిపోయాను.

ఆనాడు సరస్వతి ఎదురు తిరగాల్సింది అన్నప్పుడు శ్రీవారు ఎందుకు నవ్వారో ఇప్పుడర్థమయింది. మా శివుడి లీలలు ప్రశాంతంగా ముగిసి నందుకు, మురిసిపోతూ సరే నన్నాను.